## క్లుప్తంగా

### అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకుడు

**సీతంపేట:** స్వర సంగమం(హైదరాబాద్), స్వర మాధుర్యం(వైజాగ్) సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి పి.వి.రఘుపతి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. గాయనీ గాయకులు ఆనందరెడ్డి, సంపత్‌కుమార్, శ్రియ, శశిరాణి, శైలజ మెరాజ్, మాధవి అద్భుతంగా పాటలు పాడి శ్రోతలను మెప్పించారు.

### లింగ సమానత్వం అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణుడు శివ

**ఏయూ క్యాంపస్:** సమాజంలో లింగ సమానత్వం ఎంతో అవసరమని ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ చప్పా అన్నారు. ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్, నేస్తం సోజిక్స్ సంయుక్తంగా ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాల విద్యార్థులకు రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ సమానత్వం, ఎల్‌జీబీటీక్యూఐఏ హక్కులు, మానవ హక్కులు, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. 8 నుంచి 10వ తరగతికి చెందిన 200 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలకు తమ సంస్థ తరపున నిర్వహిస్తామన్నారు. జన్మతహ వచ్చిన జెండర్‌ను కొనసాగించడం, సమాజంతో అందరితో సమానంగా జీవించడం ఎంతో అవసరమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సలోమి మాట్లాడుతూ ఎంతో సున్నితమైన అంశంపై నిపుణులు విస్తృత అవగాహన కల్పించారన్నారు. జెండర్ స్టడీస్ నిపుణుడు శివ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా సమాజంలోని వివిధ వ్యక్తులు, వారి మధ్య లింగ సమానత్వం, వారి హక్కులను తెలుసుకుంటూ పరస్పరం గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు.

### వర్షానికి కూలిన భారీ వృక్షం



క్రౌన్ బేకరీ వద్ద రోడ్డుపై కూలిన చెట్టు

**సీతంపేట:** నగరంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి శంకరమఠం రోడ్డులో క్రౌన్ బేకరీ జంక్షన్ వద్ద భారీ చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా కూలడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వర్షం కురుస్తుండటంతో రాకపోకలు పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడటంతో ఒకవైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండో వైపు వాహనాలు రాకపోకలు సాగించడంతో రద్దీ ఏర్పడింది. మరోవైపు జోరువానలో జనం తడుస్తూ ప్రయాణాలు సాగించారు.



# మత్తుతో బంగారు భవిత నాశనం

**సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ**



వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు





సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ, చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, ప్రభుత్వ మానసిక వైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామిరెడ్డి, అధికారులు

**మహారాణిపేట :** మత్తు పదార్థాలతో పిల్లలు, పెద్దలు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, వారందరికీ అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్టు తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వీటికి యువత అలవాటు పడకుండా ఎప్పటికప్పుడు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలు వినియోగించి ఎంతో మంది విద్యార్థులు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, ప్రభుత్వ మానసిక వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి, డి – అడిక్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, వివిధ విభాగాల అధికారులు శైలజ, బద్రి, ఆరోగ్య సిబ్బంది, ఎంపీహెచ్‌ఈవో, తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాల రహిత భారత్ లక్ష్యం

**మహారాణిపేట:** మాదక ద్రవ్యాల రహిత భారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ తయారీ, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ క్యాంపస్‌ను డ్రగ్స్ రహితంగా ఉంచడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ ఎ.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడుకుంటామని, డ్రగ్ ఫ్రీ ఇండియా లక్ష్యాన్ని చేరుకుంటామని ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఏఎంసీలో ప్రతిజ్ఞ చేస్తున్న కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ కృష్ణవేణి, తదితరులు

# కిటకిటలాడుతున్న కేజీహెచ్

**మందుల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతం**



కేజీహెచ్‌లో మందులు ఇచ్చే గది వద్ద రద్దీ

**మహారాణిపేట:** కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో వారికి మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. గత మూడు రోజుల నుంచి మందులు ఇచ్చే కౌంటర్లు రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్నాయి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్ గతంలో కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగంలో మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునికీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మాసిస్టులతో కౌంటర్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గత మూడు రోజులుగా అన్ని కౌంటర్లూ కిటకిటలాడుతున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. మందుల కోసం రోజు వారీ రోగులే కాకుండా పాత రోగులు కూడా చీటీలు తీసుకొని కౌంటర్లకు వస్తుండడంతో రద్దీ ఎక్కువగా వుంది.

# కేజీహెచ్‌లో షెడ్డు ప్రారంభం నేడు



కేజీహెచ్‌లో రోగుల సహాయకుల కోసం నిర్మించిన షెడ్డు లోపలి భాగం

**మహారాణిపేట:** కేజీహెచ్‌లో పిల్లల వార్డు వద్ద రోగుల సహాయకుల కోసం రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును గురువారం ప్రారంభించనున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు పడే ఇబ్బందులు చూసిన అప్పటి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున షెడ్డు నిర్మాణానికి సహకారం అందించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఏఈ నాయుడు ఆధ్వర్యంలో షెడ్డు నిర్మించారు. కేజీహెచ్‌లో ఇప్పటి వరకు పలు వార్డుల్లో రోగుల సహాయకుల కోసం 10 షెడ్లు నిర్మించారు. ఇప్పుడు పిల్లల వార్డు వద్ద 11వ షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రారంభిస్తారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొంటారని తెలిపారు.

# జీవితానుభవాల నుంచే కథలు



మాట్లాడుతున్న రచయిత సుగుణరావు

**సీతంపేట:** రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. నడుస్తున్న చరిత్రను రికార్డు చేసే సాంఘిక బాధ్యత రచయితకు ఉండాలన్నారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ సామాజిక అంశాలు, సమస్యలను ఆకళింపు చేసుకుని నిబద్ధతగా రాసే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జీవితం నుంచే కథానికలు వస్తాయని, కథాశిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, పీవీఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ తదితరులు కథా పఠనం చేశారు.

### లలితా పీఠంలో దక్షిణామూర్తి ఆరాధన



దక్షిణామూర్తి పరమహంసకు హారతిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

**సీతంపేట:** గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస ఆరాధన జరిగింది. లలితానగర్‌లోని పీఠం ఆవరణలో గల దక్షిణామూర్తి మందిరంలో స్వామికి విశేష అభిషేకం, అర్చన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు, ప్రస్తుత లలిత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి స్వయంగా దక్షిణామూర్తికి ప్రత్యేక హారతి సమర్పించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు.

# దోమల నిర్మూలనకు ఫ్రైడే డ్రైడే తప్పనిసరి



చిలకపేటలో అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ జోన్ - 4 ఏఎంహెచ్‌వో రాజేష్

**జగదాంబ:** దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం ప్రజలంతా డ్రైడేగా పాటించాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ సూచించారు. బుధవారం జీవీఎంసీ 39వ వార్డులో డ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లలో ఉన్న నిల్వ నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కుండీలు, నీటి డ్రమ్‌లకు క్లాత్ చుట్టి పెట్టుకోవాలన్నారు. ఇంట్లో ఫ్రిజ్‌లు వెనక ఉన్న నీటిని కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. వర్షం కురిసిన తరువాత పారిశుధ్య సిబ్బంది నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న భక్త నత్కీర నాటక ప్రదర్శన



నాటకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

**సీతంపేట:** శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రంగస్థల కళాకారుడు, పలు నంది పురస్కారాల గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందం ప్రదర్శించిన భక్త నత్కీర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీకాళహస్తి మహత్స్యం కావ్యం ఆధారంగా మీగడ రామలింగస్వామి రచించిన ఈ నాటకంలో ఆయన నత్కీరుడు పాత్ర అద్భుతంగా పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదుడిగా డాక్టర్ అత్తిలి శంకర్, హరద్విజుడుగా ధూపం గురుమూర్తి, మహామంత్రి కె.గోపినాయుడు, మహాశివుడుగా జి.సూర్యనారాయణ, బాల శివభక్తులుగా హనీష్, సహస్ర, దాసరిగా రుద్రనారాయణ, బుడత కీచకుడిగా డాక్టర్ మోహనరావు, రాజనర్తకిగా ఎస్.సరస్వతి తదితరులు చక్కని నటనతో రసోచితమైన పద్య పఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహన పరిచారు. వీరికి హార్మోనియంపై మీగడ మల్లికార్జున స్వామి, డోలక్‌పై కె.బాలకృష్ణ వాద్య సహకారం అందించారు. అలంకరణ, ఆహార్యం మీరా, సత్యం చేశారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరిగిన నాటక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా స్వామి వారి చేతుల మీదుగా నాటక బృందాన్ని ఘనంగా సత్కరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# తిరుమలలో సౌకర్యాల కల్పనపై లేఖ

**ఎంవీపీ కాలనీ:** తిరుమలలో శ్రీవారి భక్తుల కోసం అక్షరధామం పేరుతో ధార్మిక సముదాయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల సౌకర్యాలు కల్పించాలని కోరుతూ విశాఖ సాగర తీర కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు టీటీడీ ఈవో శ్యామలరావుకు లేఖ రాశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్యూలైన్‌లో భక్తులకు ప్రవచనాలు, హరికథలు, సంకీర్తనలు వినిపించేలా ప్రత్యేక ప్రోగ్రామ్‌లు నిర్వహించాలని కోరారు. దర్శనం నిమిత్తం వచ్చి వెయింట్ రూమ్స్‌లో ఉండే భక్తుల పిల్లలకు ఆధ్యాత్మికంగా పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలన్నారు. ఇందుకు అనుగుణంగా విశాఖ సాగర తీర కార్తీక దీపోత్సవ కమిటీ సహకారం అందిస్తుందని కమిటీ సభ్యులు రాజేష్, హిమాన్షు ప్రసాద్ లేఖలో పేర్కొన్నారు.

### 29న జాతీయ లోక్ అదాలత్

**గాజువాక:** జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్, యుటిలిటీ తగాదాలు, క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, పెట్టీ కేసులు, మున్సిపల్ వివాదాలు, పెండింగ్‌లో ఉన్న, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు రామస్వామి

**అగనంపూడి:** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1231వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో పాల్గొన్న రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ ఉక్కు పురోభివృద్ధి సాధించగలదన్నారు. సెయిల్ నుంచి వేరు చేసే సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన వనరులు సమకూర్చుతామని హామీ ఇచ్చారని, కాని నెరవేర్చలేదు సరికదా లాభాల్లో ఉన్న ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టేసి నామమాత్రపు రేటుకు అమ్మేయాలని చూస్తుండడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావల్సిన మైన్స్ అనుమతులు వెంటనే ఇప్పించాలని వర్కింగ్ క్యాపిటల్‌ను అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రామరావు, విల్లా రామ్మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్



హెచ్‌బీ కాలనీలోని పార్కులో పనుల తీరును అడిగి తెలుసుకుంటున్న ఏడీసీ విశ్వనాథన్

**పెదగంట్యాడ:** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. జీవీఎంసీ 65వ వార్డులోని ఇండోర్ స్టేడియంతో పాటు 76వ వార్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా చేపట్టిన పార్కు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఏయే పనులు చేస్తున్నారో నిశితంగా చూశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇండోర్ స్టేడియం లోపల సీలింగ్, గచ్చులు, బయట ఎలివేషన్ పనులను గతంలోనే ప్రారంభించినా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత పనులు నిలిపివేశారు. కోడ్ అనంతరం పనులు పునఃప్రారంభం కావడంతో ఆ పనులను ఏడీసీ విశ్వనాథన్ స్వయంగా పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించినా, నాణ్యత పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీసీ పర్యటనలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, డీఈ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


# ‘ఆత్మహత్య కాదు.. వరకట్న హత్యే’



పద్మిని (ఫైల్)

**దాబాగార్డెన్స్:** తమ కుమార్తెది ఆత్మహత్య కాదని, వరకట్న హత్యేనని అనకాపల్లికి చెందిన మొల్లి అప్పారావు ఆరోపించారు. బుధవారం కేజీహెచ్ మార్చురీ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గాజువాకకు చెందిన సోమేశ్‌తో 2018లో తమ కుమార్తె పద్మినికి వివాహమైందన్నారు. ఐదేళ్ల కుమార్తె, ఏడాది బాలుడు ఉన్నారని అప్పారావు తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన పద్మిని పురుగు మందు తాగిందని, 3న మధ్యాహ్నం 12 గంటలకు కేజీహెచ్‌లో చేర్పించినట్టు సోమేశ్ తనకు 3వ తేదీ సాయంత్రం 7 గంటలకు చెప్పాడన్నారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం తమ కుమార్తె మృతి చెందిందని అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లి జరిగిన నాటి నుంచి అదనపు కట్నం కోసం, విడాకుల కోసం తరచూ వేధించేవాడని ఆయన తెలిపారు. తమ కుమార్తె మరణానికి కారణమైన అల్లుడు సోమేష్‌కు గాజువాక పోలీసుల సహాయం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

# విధి నిర్వహణలో అంకితభావంతో గుర్తింపు



ముసలయ్యను సత్కరిస్తున్న విభాగాధిపతి సేన్

**ఉక్కునగరం:** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని స్టీల్ ప్లాంట్ మీడియం మర్చంట్ అండ్ స్ట్రక్చరల్ మిల్ విభాగాధిపతి సైబాల్ సేన్ అన్నారు. ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు ఎ.పార్థసారథి, ఆర్.చిన్నయ్య, ఆర్.ముసలయ్యలను విభాగంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సేన్ మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగుల సేవలు అమూల్యమైనవన్నారు. వారు చేసిన కృషి వల్ల ప్లాంట్ అభివృద్ధి పథంలో నడవగలిగిందన్నారు. జూనియర్ ఉద్యోగులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐ.ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అధికారులు పాల్. ఎ.వి. సత్యనారాయణ, ఎం.చంద్రశేఖర్, ఎం.డి.బోయర్, బి.గణేష్, మనోజ్ ఓరాన్, కార్మిక సంఘాల నాయకులు కె.పరంధామయ్య, జి.వి.రమణారావు, జి.ఆనంద్, చిట్టిబాబు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘అగ్నిపథ్’ను రద్దు చేయాలని ధర్నా





ధర్నాలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నాయకులు

**గాజువాక:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ నాయకులు పాతగాజువాక జంక్షన్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు మాట్లాడుతూ అగ్ని పథ్ ద్వారా చేపట్టిన నియామకాల్లో ఉద్యోగం కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉంటుందన్నారు. అగ్నిపథ్ ద్వారా ఉద్యోగాల్లో చేరిన యువత తర్వాత నిరుద్యోగులుగా మారుతారన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రాంబాబు, ఈశ్వరరావు, ఎస్.శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.